# దొంగ ఓట్లకు వైసీపీ కుట్ర?

**తోపుదుర్తి పంచాయతీలో 250 ఫారం-6 దరఖాస్తులు**



తోపుదుర్తిలో నకిలీ ఓటర్లను చేర్చకూడదని రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

**రాప్తాడు/ఆత్మకూరు, ఏప్రిల్ 16:** రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి స్వగ్రామం తోపుదుర్తిలో భారీగా దొంగ ఓట్ల నమోదుకు కుట్ర జరుగుతోందని అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. సొంత పంచాయతీలో మెజార్టీ కోసం ఎమ్మెల్యే పావులు కదుపుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఈనెల 14, 15 తేదీల్లో.. రెండు రోజుల్లో ఏకంగా 250 మంది ఫారం-6 (కొత్త ఓటర్ల నమోదుకు) దరఖాస్తు చేయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మే 13న జరిగే ఎన్నికలకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఈ నెల 15 వరకూ ఫారం-6 దరఖాస్తులను స్వీకరించింది. ఇదే అదనుగా తోపుదుర్తిలో భారీగా కొత్త ఓటర్ల దరఖాస్తులు చేయించినట్లు తెలిసింది. తుది జాబితాకు అనుబంధంగా.. ఈ నెల 25న కొత్త ఓటర్ల జాబితా రానుంది. అందులో చోటు దక్కినవారికి ఓటు హక్కు సంక్రమిస్తుంది. కొత్త జాబితాపై ఫిర్యాదు చేసినా.. చర్యలు తీసుకునేలోగా ఎన్నికలు పూర్తవుతాయి. అందుకే సాధ్యమైనన్ని నకిలీ ఓట్లను జాబితాలో చేర్పించాలని అధికార పార్టీ భావిస్తోందని సమాచారం. ఫారం-6 దరఖాస్తులను క్రమం తప్పకుండా ఎన్నికల కమిషన్ స్వీకరిస్తోంది. గడిచిన రెండేళ్ల నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అయినా.. చివరి రోజుల్లో వందల్లో దరఖాస్తులు రావడం అనుమానాలకు తావిస్తోంది. అధికారులపై ఒత్తిడి తెచ్చి కొత్తగా నకిలీలను చేర్పించేందుకు అధికార పార్టీ నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అధికారులు పక్కాగా పరిశీలిస్తే.. 2 ఫారం-6 దరఖాస్తుల్లో నకిలీలు బయటపడతారని స్థానికులు అంటున్నారు. తోపుదుర్తి గ్రామంలో నకిలీ ఓటర్లను జాబితాలో చేర్చవద్దని టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారులకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలో లేనివారి పేరిట ఫారం-6 దరఖాస్తులు చేయించారని వారు ఆరోపించారు. దరఖాస్తుల పరిశీలన సమయంలో బీఎల్ఓల వెంట టీడీపీ కార్యకర్తలను అనుమతించాలని కోరారు. క్లస్టర్ ఇన్‌చార్జిలు వెంకటనారాయణ, మాజీ కన్వీనర్ సూరి, ఆనంద్, నరసింహులు, మల్లన్న తదితరులు అధికారులను కలిశారు.

# పెద్ద స్కెచ్చే..!

**పనులు చేయకున్నా బిల్లులు**
**కూలీల పేరిట వైసీపీ కుట్రలు**



విడపనకల్లు ఎంపీడీఓ కార్యాలయం

**విడపనకల్లు, ఏప్రిల్ 16:** ఉపాధి పనులు చేయకపోయినా.. చేసినట్లు బిల్లులు పెట్టి.. వైసీపీ వర్గీయులు భారీగా ప్రభుత్వ సొమ్మును కాజేయాలని చూశారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది గమనించి వాటిని తిరస్కరించారు. దీంతో అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేయడం ప్రారంభించారు. 'కొత్తగా పనులు చేస్తున్నారు కదా.. అందులో కలిపి తోసేయండి..' అని హుకుం జారీ చేస్తున్నారు. ఈ వ్యవహారం పీడీ కార్యాలయం వరకూ వెళ్లినట్లు సమాచారం. విడపనకల్లు మండల పరిధిలోని వేల్పుమడుగు గ్రామంలో సుమారు 250 మంది వైసీపీ కార్యకర్తలకు ఉపాధి హామీ పనులు చేయకున్నా బిల్లులు పెట్టించారు. ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌తో కలిసి సొమ్ము కాజేసేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. కనీసం రెండు నెలలకైనా వైసీపీ అనుకూల ఉపాధి కూలీలకు బిల్లులు పెట్టాలని రికార్డులు సృష్టించారు. ఆ బిల్లులను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయం సిబ్బంది ముందు ఉంచారు. వాటిని పరిశీలించిన సిబ్బంది.. మోసాన్ని పసిగట్టారు. కూలీలు పనులు చేయకుండా బిల్లులు ఆన్‌లైన్‌లో ఎక్కిస్తే తమ ఉద్యోగాలు పోతాయని, తిరస్కరించారు. దీంతో వైసీపీ నాయకులు ఏకంగా పీడీ వద్ద పంచాయితీ పెట్టించారని సమాచారం. తాజాగా జరుగుతున్న పనులతో కలిపి.. చేయని పనులకు బిల్లులు పెట్టాలని మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఒక్కో కూలీకి రోజుకు రూ.230 ప్రకారం.. 60 రోజులకు రూ.13,800 ఖాతాలో జమ చేసేలా బిల్లులను సిద్ధం చేశారని సమాచారం. ఈ మోసానికి విడపనకల్లు ఉపాధి హామీ సిబ్బంది సాహసించలేదు. తాము సహకరించలేమని వెనక్కి పంపారు. ఎన్నికల నేపథ్యంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎలాగైనా బిల్లులు చేయాలని వైసీపీ నేతలు పట్టుబడుతున్నట్లు తెలిసింది. ఉపాధి సొమ్ము రూ.34 లక్షలదాకా కాజేసి, ఓటు బ్యాంక్ పెంచుకునేందుకు అధికార పార్టీవారు ప్రయత్నం చేస్తున్నారని సమాచారం. 'మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం. మీకు ఎటువంటి నష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. బిల్లులను ఆన్‌లైన్‌లో ఎక్కించండి' అని అధికారులపై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారని తెలిసింది. ఈ విషయమై ఎంపీడీఓ కొండయ్యను, ఏపీఓ సంజీవయ్యను వివరణ కోరగా తమ వద్దకు ఎలాంటి బిల్లులు రాలేదని అన్నారు. ఎంబుక్‌లు, మస్టర్లు లేకుండా ఆన్‌లైన్‌లో బిల్లులు ఎక్కించలేమని అన్నారు. తమ ఉద్యోగాలు పోయే పనులను తామెందుకు చేస్తామని ప్రశ్నించారు.

**సమష్టిగా పనిచేద్దాం..**

**కూటమి నేతలతో మాజీ మంత్రి పరిటాల సునీత**

# జగన్‌ను సాగనంపుదాం



మాట్లాడుతున్న రాప్తాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి పరిటాల సునీత

**అనంతపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందించేందుకు సమష్టిగా పనిచేద్దామని మాజీ మంత్రి, రాప్తాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి పరిటాల సునీత పిలుపునిచ్చారు. కూటమి నేతలు జట్టుగా పనిచేసి జగన్‌ను ఇంటికి సాగనంపుదామని అన్నారు. అనంతపురంలోని తన నివాసంలో మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. టీడీపీ హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కొల్లకుంట అంజనప్పతో కలిసి ఎన్నికల వ్యూహం గురించి చర్చించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలిశారని, కేంద్రం సహకారం ఉండాలనే ఉద్దేశంతో బీజేపీతో టీడీపీ అధినాయకత్వం పొత్తు పెట్టుకుందని అన్నారు. మూడు పార్టీలకు రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని అన్నారు. అందుకే 2014 కాంబినేషన్ మరోసారి రిపీట్ అయిందని అన్నారు. 2014 కంటే ఈసారి వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని అన్నారు. అప్పటి కాంగ్రెస్ పాలన కంటే ఇప్పటి జగన్ పాలన మరింత అధ్వానంగా ఉందని విమర్శించారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. మన విజయం ఖరారైనా, జగన్ రెడ్డి అధికార, అంగబలం ఉపయోగించే అవకాశం ఉందని, వాటిని ఎదుర్కొనేందుకు సమాయత్తం కావాలని సూచించారు. పెద్ద కార్యక్రమాలు జరిగినప్పుడు కలిసి వెళదామని, మిగిలిన సమయాల్లో ఎక్కడికక్కడ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాలని కోరారు. బీజేపీ, జనసేన నాయకులు కలిసికట్టుగా పనిచేసి రాప్తాడులో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సాకే పవన్‌కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, ఓబులేసు, చైతన్య, కిశోర్, కాటమయ్య, టీడీపీ రాష్ట్ర, పార్లమెంటు నియోజకవర్గ కమిటీల నాయకులు, మండల అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, ఏఎంసీ మాజీ చైర్మన్లు, సాధికార సమితి కన్వీనర్లు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్‌పై ప్రత్యేక దృష్టి

**జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్**



రాజకీయపార్టీల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరు

**అనంతపురం టౌన్, ఏప్రిల్ 16:** పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై ఈసారి ప్రత్యేక దృష్టి పెడతామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది తదితరులు పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకునేలా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కోసం ప్రతి ఒక్కరికీ ఫారం-12 ఇస్తామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారా లేదా అని అర్హులకు ఫోన్ చేసి విచారిస్తామని, మెసేజ్‌లు, ఐవీఆర్ఎస్ కాల్స్ పంపుతామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్లు వందశాతం వినియోగించుకునేలా రాజకీయ పార్టీలు కూడా సహకరించాలని కోరారు. జిల్లాలో ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ తొలి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని అన్నారు. వాటిని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు తరలించి, స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచామని తెలిపారు. ఈ నెల 14 వరకు వచ్చిన కొత్త ఫారం-6, 7, 8 దరకాస్తులను ఈ నెల 25లోగా పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని, సందేహించాల్సిన పనిలేదని అన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని రాజకీయ పార్టీలకు సూచించారు.

- ఎన్నికల విధుల్లో పాల్గొనే 33 శాఖ ఉద్యోగులు, అధికారులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉంటుందని జేసీ కేతన్‌గార్గ్ తెలిపారు. ప్రతి ఒక్క శాఖకు ఒక నోడల్ అధికారిని నియమించామని తెలిపారు. హోం ఓటింగ్‌కు 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, నడవలేని దివ్యాంగులు అర్హులని, వారికి అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గ కేంద్రాలలో ఎన్నికల ఖర్చులకు సంబంధించి రేట్ చార్ట్‌లను ఏర్పాటు చేశామని, అంతకు మించి ఖర్చు చేస్తే నమోదు చేస్తామని తెలిపారు. ఫిర్యాదులను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ వైభోమ్ నిదియా, నగరపాలిక కమిషనర్ మేఘస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకరిపై వేటు..!

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

**అనంతపురం విద్య, ఏప్రిల్ 16:** ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది డేటాను కలెక్టరేట్ నుంచి లీక్ చేసిన వ్యవహారంలో అధికారులు చర్యలకు దిగారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు ఒక పీడీని మంగళవారం సస్పెండ్ చేశారని తెలిసింది. సార్వత్రిక ఎన్నికల విధులకు నియమించిన అధికారుల జాబితాను కొందరు అధికారులు, ఉపాధ్యాయులు సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టు చేయడం దుమారం రేపింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో కలెక్టరేట్, పోలీసులు, విద్యాశాఖ అధికారులు విచారణకు దిగారు. యల్లనూరు మండలంలోని జడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్(పీడీ) విజయకుమారి ఉపాధ్యాయుల వాట్సప్ గ్రూప్స్‌లో డేటాను షేర్ చేసినట్లు గుర్తించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమెను డీఈఓ సస్పెండ్ చేసినట్లు తెలిసింది. మరికొందరిపై కూడా వేటు పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారులు గోప్యత పాటిస్తున్నారు.

# డబ్బులు ఎప్పుడిస్తారు..?

సీఎం జగన్ బటన్ నొక్కి నెలలు గడుస్తున్నా ఆసరా సొమ్ము జమ కాకపోవడంతో రామగిరి మండలంలో డ్వాక్రా మహిళలు ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సిబ్బందిని మంగళవారం నిలదీశారు. మండల వ్యాప్తంగా 815 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ఇందులో 220 గ్రూపులకు రూ.కోటికి పైగా ఆసరా సొమ్ము అందాల్సి ఉంది. కొన్ని సంఘాలవారికి డబ్బులు చెల్లించి, మరికొందరికి ఇవ్వకపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. -రామగిరి



నిరసన తెలుపుతున్న డ్వాక్రా మహిళలు

# అదే తీరు..!

**ముగ్గురు వలంటీర్ల తొలగింపు**

**అనంతపురం/రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 16:** ఎన్నికల ప్రచారంలో ఉపాధి సిబ్బంది, వలంటీర్లు పాల్గొంటూనే ఉన్నారు. దీంతో అధికారులు వారిపై చర్యలు తీసుకుంటున్నారు. కూడేరు మండలం రామచంద్రపురంలో వైసీపీ అభ్యర్థితో కలిసి గొట్కూరు ఫీల్డ్ అసిస్టెంట్ జయప్ప మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పదిరోజుల క్రితం ముద్దలాపురంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో మరుట్ల ఫీల్డ్ అసిస్టెంట్ బయపురెడ్డి పాల్గొనగా, తాజాగా జయప్ప ప్రచారంలో పాల్గొనడం గమనార్హం. రాయదుర్గం మండలంలోని ఆర్‌టీ వంక గ్రామ పంచాయతీలో వైసీపీ అభ్యర్థి తరఫున ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు మంజునాథ నాయక్, పాపానాయుడు నాయక్, భోజరాజును విధుల నుంచి తొలగించామని ఎంపీడీఓ అల్లా బకాష్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి, చర్యలు తీసుకున్నారు.

| ఉష్ణోగ్రతలు | అనంతపురం | |
|---|---|---|
| గరిష్ఠం కనిష్ఠం | 41.0 | 25.0 |

# కపట ప్రేమ !

## ముస్లిం మైనార్టీల పట్ల వైసీపీ ఉత్తుత్తి ప్రేమ


ఫ్యాకల్టీ కోసం నిర్మించిన క్వార్టర్స్


ప్రిన్సిపాల్ భవనం


రెసిడెన్షియల్ స్కూల్...

- కదిరిలో ప్రారంభానికి నోచుకోని విద్యా భవనాలు
- నిర్లక్ష్యానికి నిదర్శనంగా రెసిడెన్షియల్ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాల
- టీడీపీ నిర్మించిందనే ప్రారంభానికి అడ్డు..?




రెసిడెన్షియల్ పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాల భవనాల సముదాయం

**అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 16:** ముస్లిం మైనార్టీల పట్ల వైసీపీ ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముస్లిం మైనార్టీ జనాభా ఎక్కువగా ఉన్న కదిరి నియోజకవర్గంలో గత టీడీపీ ప్రభుత్వం కేంద్రం సహకారంతో పేద విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ పాఠశాల, పాలిటెక్నికల్ కళాశాలను నిర్మించింది. 2019 ఎన్నికలు రావడం, వైసీపీ అధికారం చేపట్టడంతో ఆ భవనాలు ప్రారంభానికి నోచుకోకుండా పోయాయి. కేవలం టీడీపీకి పేరొస్తుందనే అక్కసుతోనే ఆ పాఠశాల, కళాశాలను వినియోగంలోకి రాకుండా చేసిందన్న విమర్శలు ముస్లిం మైనార్టీ వర్గాల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

### దాదాపు రూ. 36 కోట్లతో నిర్మాణం...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పీఎంజేవీకే కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కదిరి నియోజకవర్గ కేంద్రంలో 20 ఎకరాల స్థలాన్ని సేకరించాయి. రెసిడెన్షియల్ పాఠశాల కోసం రూ. 18 కోట్లు, పాలిటెక్నికల్ కళాశాల కోసం రూ. 17.78 కోట్లు విడుదల చేశారు. దీంతో రెసిడెన్షియల్ పాఠశాల, పాలిటెక్నికల్ కళాశాల, హాస్టల్, సువిశాలమైన మెస్ హాల్, ప్రిన్సిపాళ్ల భవనాలు, ఫ్యాకల్టీ కోసం ప్రత్యేకంగా క్వార్టర్స్‌తో ఒక మినీ యూనివర్సిటీని తలపించేలా భవన నిర్మాణాలు చేపట్టారు. పాలిటెక్నిక్ కళాశాలకు సంబంధించి చిన్నచిన్న పనులు మినహా అన్నీ పూర్తయ్యాయి. 2019 ఎన్నికలు రావడం ఆ భవనాల ప్రారంభానికి అడ్డు పడినట్లయింది. అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ భవనాలను ప్రారంభించకపోగా వాటిని పలు ప్రభుత్వ శాఖలు వినియోగించుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. స్థానిక ప్రతిపక్ష నేతలు, ముస్లింమైనార్టీ ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. అప్పటి నుంచి ఆ భవనాలను పట్టించుకోకపోవడంతో ఐదేళ్లుగా నిరుపయోగంగా మారిపోయాయి.


పాలిటెక్నిక్ కళాశాల భవనం

### ఐదేళ్లుగా ముస్లిం మైనార్టీల అణచివేత

వైసీపీ ఐదేళ్ల పాలనలో ముస్లిం మైనార్టీలను కోలుకోలేని విధంగా దెబ్బతీశారు. ముస్లింల పక్షపాత ప్రభుత్వమంటూనే ఆవర్గాలను ముంచేసింది. కదిరిలో ముస్లిం మైనార్టీల జనాభాను దృష్టిలో ఉంచుకొని టీడీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో రెసిడెన్షియల్ పాఠశాల, పాలిటెక్నికల్ కళాశాలను నిర్మిస్తే... వాటిని ప్రారంభించకుండా ముస్లిం మైనార్టీ పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసింది. ఎటు చూసినా మైనార్టీలను అణగదొక్కేందుకే వైసీపీ ప్రభుత్వం పాకులాడింది.



**సైపుద్దీన్, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి**

---

## 18 ప్రాంతాల్లో వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాలు



**అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 16:** జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 18 ప్రాంతాల్లో వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు. మే 1 నుంచి 21 వరకు నిర్వహించే కోచింగ్ క్యాంపులకు 8-16 సంవత్సరాల మధ్య వయసుగల క్రీడాకారులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆయా ప్రాంతాల్లో కోచ్‌లను సంప్రదించాలని కోరారు.

| ప్రాంతం పేరు | కోచ్ పేరు | ఫోన్ నంబర్ |
|---|---|---|
| అనంతపురం, పీటీసీ | చంద్రమోహన్‌రెడ్డి | 9440243600 |
| అనంతపురం, ఎస్ఎస్‌బీఎన్ | షర్మాస్‌వలీ | 9177948117 |
| ఆర్డీటీ స్టేడియం | ప్రవీణ్ | 6305394530 |
| ఆత్మకూరు | అహ్మద్ రఫీ | 6281044454 |
| బత్తలపల్లి | భానుప్రకాష్ | 9177995538 |
| బుక్కరాయసముద్రం | వెంకటేష్ | 9441489422 |
| ధర్మవరం | రాజశేఖర్ | 9985929285 |
| గుంతకల్లు రైల్వే | గులామ్‌ఖాదీర్‌బాషా | 9885047063 |
| గుంతకల్లు | ఇనయతుల్లా | 9701435534 |
| గుత్తి | రాఘవేంద్ర | 9398912588 |
| హిందూపురం | సల్మాన్‌ఖాన్ | 8328182794 |
| కణేకల్లు | గోపాల్‌రెడ్డి | 7780136229 |
| కళ్యాణదుర్గం | హరినాథ్‌రెడ్డి | 9985344127 |
| కదిరి | నజీర్‌అహ్మద్ | 9490860339 |
| మడకశిర | నాగేంద్ర | 9440566697 |
| నార్పల | మహేశ్వర్ | 9000032600 |
| పెనుకొండ | ప్రసాద్ | 8985089910 |
| తాడిపత్రి | జయభార్గవ్ | 9347640651 |

## యూపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### అధికారులతో సమీక్షలో కలెక్టర్



**అనంతపురం టౌన్, ఏప్రిల్ 16:** జిల్లాలో జరిగే యూనియన్ పబ్లిక్ సర్వీస్ (యూపీఎస్సీ) కమిషన్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఈ పరీక్షలపై సంబంధిత ఎగ్జామినర్లు, రూట్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు తదితర అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ ఈనెల 21న యూపీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 323 మంది అభ్యర్థులు ఈపరీక్షలకు హాజరవుతున్నారన్నారు. వీరికోసం జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జేఎన్‌టీయూలో ఒకటి, కేఎస్ఎన్ డిగ్రీ మహిళా కాలేజ్‌లో మరొకటి ఏర్పాటు చేశామన్నారు. జేఎన్‌టీయూ మెయిన్‌బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మూడుసెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇందులో పేపర్-1 ఇంగ్లిష్ ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు, పేపర్-2 జనరల్‌నాలెడ్జ్ పరీక్ష 12గంటల నుంచి 2గంటలవరకు, పేపర్-3 మ్యాథమేటిక్స్ పరీక్ష మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. కేఎస్ఎన్ పరీక్ష కేంద్రంలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావెల్ అకాడమీకి సంబంధించి రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందులో పేపర్-1 మాథ్‌మేటిక్స్ ఉదయం 10గంటల నుంచి 12-30 గంటల వరకు, పేపర్-2 జనరల్ ఎబిలిటీ టెస్ట్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4-30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని కలెక్టరు తెలిపారు. ఈపరీక్షల కోసం ముగ్గురు పర్యవేక్షకులు, ముగ్గురు రూట్ ఆఫీసర్లను నియమించినట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, జిరాక్స్‌సెంటర్లను మూసివేయించాలని ఆదేశించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో శానిటేషన్, తాగునీరు, విద్యుత్, గాలి వెలుతురు వంటి వసతులు ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు, కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా, నగర పాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్ఓ రామకృష్ణారెడ్డితో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# రేపటి నుంచి నామినేషన్ల ప్రక్రియ

### కలెక్టరేట్‌లో ఎంపీ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ



**అనంతపురం టౌన్/ ధర్మవరం, ఏప్రిల్ 16:** ఎన్నికల ప్రక్రియ మరో ఘట్టంలోకి అడుగిడబోతోంది. మార్చి 16న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ఇచ్చిన విషయం తెలిసిందే. 18న నోటిఫికేషన్‌తోపాటు నామినేషన్ల పర్వం ఆరంభం కానుంది. 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఇప్పటికే ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీలు ఓ దఫా ప్రచారం పూర్తి చేశాయి. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, సీఎం జగన్ జిల్లాలో ఎన్నికల ప్రచార సభలు నిర్వహించారు. పల్లె, పట్నం వీధుల్లో ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాలకు ఆయా కలెక్టరేట్‌లలో నామినేషన్లు స్వీకరిస్తారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆయా నియోజకవర్గ కేంద్రాలలో నామినేషన్లు స్వీకరణ ఉంటుంది. అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి ఆర్డీఓ కార్యాలయంలో మిగిలిన వాటికి నియోజకవర్గ కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

**జిల్లాలో ఎన్నికల ఆర్ఓలు వీరే..**

అనంత పార్లమెంటు నియోజకవర్గానికి ఎన్నికల అధికారిగా కలెక్టరు వినోద్‌కుమార్ ఉంటారు. రాయదుర్గం నియోజకవర్గ ఆర్ఓగా కరుణకుమారి, ఉరవకొండకు జేసీ కేతన్‌గార్గ్, గుంతకల్లుకు శ్రీనివాసరెడ్డి, తాడిపత్రికి రాంభూపాల్‌రెడ్డి, శింగనమలకు వెన్నెల శ్రీను, అనంతపురం అర్బన్‌కు ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, కళ్యాణదుర్గంకు ఆర్డీఓ రాణి సుష్మిత, రాప్తాడు నియోజకవర్గంకు వసంతబాబు ఆర్ఓలుగా వ్యవహరిస్తున్నారు. వీరి పర్యవేక్షణలోనే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల పక్రియ కొనసాగనున్నాయి.

**శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి..**

శ్రీసత్యసాయి జిల్లాకు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ అరుణ్‌బాబు ఉన్నారు. ఎంపీ అభ్యర్థుల నుంచి కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో, పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ భాగ్యరేఖ, కదిరి ఆర్డీఓ కార్యాలయంలో వంశీకృష్ణారెడ్డి, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అపూర్వభరత్ నామినేషన్లు స్వీకరిస్తారు. 21న ఆదివారం సెలవు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు.

**శుభముహూర్తం కోసం**

నామినేషన్లు దాఖలు చేయడానికి తమ పేరు, జన్మ నక్షత్రం ఆధారంగా శుభముహూర్తం కోసం ప్రధాన పార్టీల అభ్యర్థులు జ్యోతిష్యపండితులను సంప్రదిస్తున్నారు. 18, 19 తేదీల్లో తిథి, వార నక్షత్రం, యోగం బలంగా ఉన్నాయని, ఈ రెండు రోజులు శుభప్రదమైనవని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు. దీంతో అందుకనుగుణంగా అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

## ఎంటెక్ ఫలితాలు విడుదల

**అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 16:** జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంటెక్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. జనవరి, ఫిబ్రవరిలో ఎంటెక్ ప్రథమ, తృతీయ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. తృతీయ, సెమిస్టర్(ఆర్17), ద్వితీయ సెమిస్టర్(ఆర్21,17)తోపాటు ప్రథమ సెమిస్టర్(ఆర్17) సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయన్నారు. డిసెంబర్, జనవరిలో ప్రీపీహెచ్‌డీ వింటర్ సెషన్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## రేపు పల్లె నామినేషన్

**పుట్టపర్తి, ఏప్రిల్ 16:** తెలుగుదేశం పార్టీ తరపున గురువారం నామినేషన్లు వేస్తున్నట్టు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మంగళవారం తెలిపారు. తనతో పాటు పల్లె కిశోర్‌రెడ్డి, పల్లె సింధూరారెడ్డి టీడీపీ తరపున స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్లు వేస్తున్నామని విలేకరులకు వివరించారు. నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

# జిల్లా మీదుగా వేసవి ప్రత్యేక రైళ్లు



**గుంతకల్లు, ఏప్రిల్16:** వేసవిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లను వేసినట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాచిగూడ-కోచువెలి (నెం. 07229) ప్రత్యేక రైలును ఈ నెల 18, 25 తేదీల్లో (గురువారాలు), దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07230)ను ఈ నెల 19, 26 (శుక్రవారాలలో) నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రైలు షాద్‌నగర్, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, యర్రగుంట్ల, కడప, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పట్టి, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూరు, పాలక్కడ్, త్రిసూర్, ఎర్నాకులం, చెంగనూరు, కొల్లం స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. అలాగే హౌరా-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (నెం. 02863) ఈనెల 18, 27 తేదీల్లోనూ, తిరుగు ప్రయాణపు రైలు (నెం. 02864) ఈనెల 20, 29 తేదీల్లో నడుస్తుందన్నారు. ఈ రైలు ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, భువనేశ్వర్, ఖుర్ద రోడ్, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం స్టేషన్ల మీదుగా నడపనున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా హుబ్లీ-గోమతినగర్ (నెం. 07305) ప్రత్యేక వీక్లీ రైల్నుఈ ఈ నెల 13, 20, 27, మే 4, 11, 18 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07305)ను ఈ నెల 16, 23, 30, మే 7, 14, 21 తేదీల్లో నడపనున్నట్లు వివరించారు. ఈ రైలు రాణిబెన్నూర్, హరిహర్, ధావణగెరె, చిగ్జాజుర్, కాడూర్, అరిసికెరె, టుముకూరు, యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, బేగంపేట, సికింద్రాబాద్, ఖాజీపేట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, బాలార్షా, చంద్రాపూర్, నాగపూర్, బేతుల్, ఘోరడోంగ్రి, ఇటార్సి, భోపాల్, లలిత్‌పూర్, కాన్పూర్ సెంట్రల్, ఐష్‌బాగ్, బాద్షానగర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

## కారు డ్రైవర్ దారుణహత్య


శ్రీనివాసరెడ్డి(ఫైల్)

**ధర్మవరం, ఏప్రిల్ 16:** పట్టణంలోని కొత్తపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఓ కారు డ్రైవర్ మంగళవారం తెల్లవారుజామున దారుణహత్యకు గురయ్యాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు..పట్టణంలోని తారకరామాపురానికి చెందిన శ్రీనివాసరెడ్డి(55) కారు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇతను అందరితో బాగా కలిసిపోయేవాడు. ఈనెల 14న మదనపల్లిలో ఉన్న కుమారుడి వద్దకు వెళ్లాడు. 15న రాత్రి మదనపల్లి నుంచి రైలులో బయలుదేరి మంగళవారం తెల్లవారుజామున ధర్మవరం చేరుకున్నాడు. అయితే అంకాలమ్మగుడి వద్ద శ్రీనివాసరెడ్డిని బండరాయితో మోది చంపారు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబసభ్యులు, టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమేరాల ఫుటేజీ ఆధారంగా లోకేంద్ర, విష్ణువర్ధన్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతుడికి భార్య శారదమ్మ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇందులో జయ కృష్ణారెడ్డి, గంగాధర్‌రెడ్డి మదనపల్లిలో ఉంటు న్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

**కిరాయి విషయంలోనే హత్య**

కారు డ్రైవర్ శ్రీనివాసరెడ్డి హత్యకేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా తారకరామాపురం వద్ద ఉన్న లోకేంద్ర, విష్ణువర్ధన్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఆటో కిరాయి విషయంలో జరిగిన గొడవే హత్యకు దారి తీసినట్టు సీఐ తెలిపారు.

## రేపు ఉరవకొండకు షర్మిల రాక

**ఉరవకొండ, ఏప్రిల్ 16:** న్యాయయాత్రలో భాగంగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిల గురువారం ఉరవకొండకు రానున్నట్లు కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పాత బస్టాండ్ వద్ద సాయంత్రం బహిరంగ సభలో ఆమె ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు.

## 22 నుంచి టీసీసీ పరీక్షలు

**అనంతపురం విద్య/ కొత్తచెరువు, ఏప్రిల్ 16:** టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) 2024లో డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈనెల 22 నుంచి 25 వరకూ నిర్వహించనున్నట్లు డీఈఓలు వరలక్ష్మి, మీనాక్షి మంగళవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల హాల్‌టికెట్లు www.bse.ap.gov.inలో అందుబాటులో ఉన్నాయని, డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలన్నారు. హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఆధార్ కార్డు, పాన్‌కార్డు లేదా డ్రైవింగ్ లైసెన్సుతో పరీక్ష కేంద్రాలకు రావాలని సూచించారు. డైట్‌కు సంబంధించి 22నుంచి 27వరకు పరీక్షలు జరుగుతాయని శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ మీనాక్షి తెలిపారు.

### డీఈఓ కార్యాలయంలో టీటీసీ-2023 సర్టిఫికెట్లు

**అనంతపురం విద్య, ఏప్రిల్ 16:** గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు- 2023 పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారి సర్టిఫికెట్లు డీఈఓ ఆఫీస్‌కు వచ్చాయని డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్‌నాయక్ మంగళవారం తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్‌లో టీటీసీ సర్టిఫికెట్ల కోసం పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులు కమలానగర్‌లోని డీఈఓ ఆఫీస్‌లో రావాలని సూచించారు. టీటీసీ-2023 పరీక్షల హాల్ టికెట్లు, వారి ఫలితాల కాపీతోపాటు ఆధార్ కార్డును తీసుకుని డీఈఓ ఆఫీస్‌లో కలవాలని సూచించారు.

### చీనీకాయలు టన్ను రూ.37 వేలు

**అనంతపురంరూరల్, ఏప్రిల్ 16:** అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో చీనీకాయలు మంగళవారం టన్ను గరిష్ఠంగా రూ.37 వేలు, కనిష్ఠంగా రూ.20 వేలు, సరాసరి రూ.26 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 752 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

### గొంతులో ఇరుక్కున్న ఎముక వృద్ధుడికి అస్వస్థత

**గోరంట్ల, ఏప్రిల్ 16:** మండలంలోని కరావులపల్లికి చెందిన వృద్ధుడు పూజారి వెంకటరామప్ప గొంతులో ఎముక ఇరుక్కోవడంతో మంగళవారం అస్వస్థతకు గురయ్యాడు. మాంసాహారం భుజిస్తుండగా ఎముక గొంతులో అడ్డుపడినట్లు బంధువులు తెలిపారు. వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వీలుకాకపోవడంతో మెరుగైన వైద్యం కోసం హిందూపురం తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.

# కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

ఉమ్మడి జిల్లాలో వలంటీర్ల రాజీనామాలపర్వం కొనసాగుతోంది. వైసీపీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం కోసమే వలంటీర్లు ఇలా బరితెగించి రాజీనామా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే ఎన్ని నిబంధలు పెట్టిన కొంతమంది యానిమేటర్లు, ఉపాధి సిబ్బంది వైసీపీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే ఉన్నారు.


రాజీనామా పత్రాన్ని చూపుతున్న వలంటీర్లు (రొళ్ల)

**గుత్తిరూరల్, ఏప్రిల్ 16:** మండలంలోని శ్రీపురం (కోజ్జేపల్లి) గ్రామంలో ఆరుగురు గ్రామ, వార్డు వలంటీర్ల రాజీనామా చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసులుకి రాజీనామా పత్రలను అందజేశారు.

**గోరంట్ల:** మండలంలోని వడిగేపల్లి పంచాయతీలో 15మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు.

**రాయదుర్గంరూరల్:** మండలంలోని టీ వీరాపురం గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అల్లాబకాష్‌కు రాజీనామా పత్రాన్ని అందించారు.

**రొళ్ల:** మండలంలోని వివిధ పంచాయతీ గ్రామాల్లో పనిచేస్తున్న వలంటీర్లు రాజీనామా చేశారు. మంగళవారం రొళ్ల 1, 2 పంచాయతీలకు చెందిన వలంటీర్లు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని ఎంపీడీఓ ప్రసాద్‌కు రాజీనామా పత్రాన్ని అందజేశారు.


సమావేశంలో పాల్గొన్న కూటమి నాయకులు, నాయీబ్రాహ్మణులు


ప్రచారంలో గజమాలతో దగ్గుబాటిని సన్మానిస్తున్న అభిమానులు

# కలిసి పనిచేద్దాం.. విజయం సాధిద్దాం

## కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి

**అనంతపురం అర్బన్, ఏప్రిల్ 16:** అందరం కలిసికట్టుగా పనిచేసి ఎన్నికల్లో విజయాన్ని సాధించి... పార్టీ అధినేత చంద్రబాబుకు కానుకగా ఇద్దామని అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అనంత అర్బన్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో దౌర్జన్యాలు, రౌడీయిజం చేసేందుకు వైసీపీ నాయకులు సిద్ధంగా ఉన్నారని, వాటిని ధీటుగా ఎదుర్కొనేందుకు మనం కూడా సిద్ధంగా కావాలన్నారు. ఐదేళ్లపాటు అనంత అర్బన్‌లో పార్టీ కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఐదేళ్లు కష్టపడ్డారని, ఆయన అంతగా కష్టపడ్డారు కాబట్టే ఈ ఎన్నికల్లో తన గెలుపు నల్లేరు మీద నడకలా మారిందని అన్నారు. పార్టీ అధిష్ఠానం ఆయన సేవలు గురించి జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించిందని గుర్తుచేశారు. ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ఏ బూత్ పరిధిలో ఎక్కువ మెజార్టీ వస్తే ఆయా ఇన్‌చార్జిలకు మంచి పదవులు ఉంటాయన్నారు. ఎక్కడ వైసీపీ నాయకులు బెదిరింపులు, దౌర్జన్యాలకు దిగిన తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అర్బన్ పరిశీలకులు రమణారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, టీడీపీ అభ్యర్థుల గెలుపు ప్రజలకు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, నాయకులు డిష్ నాగరాజు, సరిపూటి రమణ, దేవళ్ల మురళి, మారుతీ కుమార్ గౌడ్, స్వామిదాస్, ముక్తియార్, గోపాల్ గౌడ్, పీఎం లక్ష్మీప్రసాద్, నెట్టెం బాలకృష్ణ, సైఫుద్దీన్, లింగారెడ్డి, గుర్రం నాగభూషణం, రాజారావు, మార్కెట్ మహేష్, బాలప్ప, వన్నూరు, తెలుగు మహిళలు స్వప్న, విజయశ్రీరెడ్డి, విశాలాక్షి, బల్లా పల్లవి, సరోజమ్మ, సంగా తేజస్విని, జనసేన నాయకులు కాయగూరల లక్ష్మీపతి, పెండ్యాల శ్రీలత, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నాయీబ్రాహ్మణులు టీడీపీలో చేరిక

దగ్గుబాటి ప్రసాద్, అంబికా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికార సమితి నగర అధ్యక్షుడు కడియాల కొండన్న ఆధ్వర్యంలో 100 మంది నాయీబ్రాహ్మణులు టీడీపీలో చేరారు. అజయ్, కుళ్లాయప్ప, జగన్ తదితరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు.

### కరపత్రాల ఆవిష్కరణ

చంద్రబాబు గెలుపు... పెన్షనర్ల పిలుపు కరపత్రాలను దగ్గుబాటి ప్రసాద్ ఆవిష్కరించారు. స్థానిక శ్రీనగర్ కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో దగ్గుబాటిని పలువురు ఏపీ పెన్షనర్ల సంఘం నాయకులు కలిసి మద్దతునిచ్చారు. కార్యక్రమంలో వెంకటనరసయ్య, చలపతి, వేణుగోపాల్, మస్తాన్ పాల్గొన్నారు.

### ప్రచారానికి భారీ స్పందన

**అనంతపురంరూరల్:** నగరంలోని 41,45, 47 డివిజన్లలో దగ్గుబాటి ప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ ఇన్‌చార్జులు దలవాయి పెద్దమారెప్ప, సిమెంట్ పోలన్న, దలవాయి వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఆయన ఈ ప్రచారం చేట్టారు. తాము అధికారంలోకి రాగానే నడిమి వంకకు రక్షణ గోడ నిర్మించి శాశ్వత పరిష్కరం చూపిస్తా మన్నారు. కల్వర్టులన్నీ పూర్తి చేస్తామని, కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు కూడా పరిష్కరిస్తామని అన్నారు. ఇలాంటి చిన్న, చిన్న సమస్యలు కూ డా పరిష్కరించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. తాము అధికారంలోకి రాగానే అం డర్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామన్నారు. డంపింగ్ యార్డును తరలించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, తెలుగు యువత ఉపాధ్యక్షులు దలవాయి వెంకటేష్, మాజీ కార్పొరేటర్లు బంగారక్క, సరళ, భవాని, బల్లా పల్లవి, రాజారావు, సరోజమ్మ, మాజీ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళీ, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, మాజీ నగర అధ్యక్షులు కృష్ణకుమార్, టిఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు లక్ష్మీనరసింహులు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ, డేరంగుల వెంకటాద్రి, టీడీపీ సీనియర్ నాయకులు మణికంఠబాబు పాల్గొన్నారు.

# రేపట్నుంచి ఎన్నికల ప్రచారం

## కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత

**రామగిరి, ఏప్రిల్ 16:** ఎన్నికల ప్రచారానికి గురువారం నుంచి శ్రీకారం చుడుతున్నట్లు మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. ముత్తవకుంట్ల, తల్లిమడుగుల గ్రామాల టీడీపీ ముఖ్య నాయకులతో మంగళవారం వెంకటాపురంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సెంటిమెంట్ ప్రకారం ప్రతి ఎన్నికల్లో పరిటాల రవీంద్ర హయాం నుంచి కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల నుంచి ప్రచారాన్ని ప్రారంభిస్తున్నామని, ఈ సారీ అదే గ్రామం నుంచి ప్రచారాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

### వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురి చేరిక

**ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్:** రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు వార్డు మెంబర్లు కార్యకర్తలు చేరారు. ఆత్మకూరు మండలం పంపనూరు తండాకి చెందిన పంచాయతీ వార్డు మెంబర్లు లక్ష్మీదేవి, వెంకటేష్ నాయక్, రాప్తాడు, అనంతపురం రూరల్, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌ల ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. అనంతపురంరూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి టీడీపీలో చేరారు. పార్టీలోకి చేరిన వారందరికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కొత్త, పాత అన్న తేడా లేకుండా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా తాము ఉన్నామని... పార్టీ విజయం కోసం ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీలోకి చేరిన వారిలో రాప్తాడు గ్రామానికి చెందిన తలారి శివ, మాజీ సర్పంచ్ మాన్లుకోసే రామాంజనేయులు కుమారుడు మాన్లుకోసే కేశవ, చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామానికి చెందిన నగేష్, కొండయ్య, చెన్నకేశవులు, ప్యాదిండి గ్రామానికి చెందిన ఓబుళపతి, లక్ష్మీపతి, నారాయణ, కుళ్లాయప్ప, దుర్గప్ప, పంపనూరు తండాకు చెందిన లక్ష్మీనారాయణ, ప్రశాంత్ నాయక్, రమేష్ నాయక్, రామకృష్ణ నాయక్, అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల సునీత

### గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: చౌదరి

**అనంతపురం అర్బన్ :** ఉమ్మడి జిల్లాలో అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జోన్ - 5 ఎన్నికల సమన్వయ కర్త, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి సూచించారు. మంగళవారం స్థానిక రాంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో అనంతపురం, హిందూపురం ఎన్నికల సమన్వయ కర్తలు నిమ్మల క్రిష్టప్ప, గుండుమల తిప్పేస్వామి, పూల నాగరాజులతో ఆయన సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లాలో ఎన్నికల వ్యూహాలు, ప్రచారం చేయాల్సిన అంశాలపై చర్చించారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని ప్రచార కార్యక్రమాలను మరింత ఉధృతం చేసేలా చూడాలన్నారు.

# దుబ్బార్లపల్లిలో బాబుష్యూరిటీ... భవిష్యత్తు గ్యారెంటీ

**రామగిరి, ఏప్రిల్ 16:** మండలంలోని దుబ్బార్లపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచారాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలనప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. సూపర్‌సిక్స్ పథకాలతో పాటు అందిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న పథకాలు కొనసాగి స్తామన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, వైసీపీ నాయకుల దుష్ప్రచారం నమ్మరాదని సూచించారు. వైసీపీ హయాంలో చేసిన అభివృద్ధి శూన్యమని, చెప్పిన హామీలు కూడా నెరవేర్చలేదని విమర్శించారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధే తప్పా వైసీపీ ఎక్కడైనా అభివృద్ధి చేసిందా... అని అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే అన్ని వర్గాలకు తగిన న్యాయం జరుగుతుందన్నారు.


దుబ్బార్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

## జోరుగా టీడీపీ ప్రచారం

**బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 16:** స్థానిక జనచైతన్య కాలనీ, శర్మకాలనీ, హమాలీకాలనీ, రామిరెడ్డి కాలనీలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణీశ్రీ, ఎంపీ అభ్యర్థి అంబికాలక్ష్మీనారాయణను గెలిపిం చాలని ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, కన్వీనర్ అశోక్, టీడీపీ నేతలు సాయినాథ్‌రెడ్డి కేశన్న పాల్గొన్నారు.

**గార్లదిన్నె :** టీడీపీని గెలిపించాలని మండలంలోని కల్లూరులో మంగళవారం నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇందులో శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ సోదరి బండారు కిన్నెర శ్రీ, మాజీ సర్పంచు వడ్ల సుంకమ్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇల్లూరు రామాంజి, వడ్డే వన్నూర్, గుత్తా బాలకృష్ణ, బొగ్గుల వెంకటేసు పాల్గొన్నారు.

**రాప్తాడు**: మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోరి కొత్తపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సోమరా నారాయణస్వామి, పుల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, నారాయణస్వామి, అనంతనేని రామకృష్ణ, అనంతనేని ఎర్రిస్వామి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో జూనియర్ లైన్‌మన్ మృతి


మురళీక్రిష్ణ (ఫైల్)

**చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 16:** మండలంలోని నాగసముద్రంక్రాస్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో ఎన్ఎస్ గేటుకు చెందిన మురళీక్రిష్ణ (40) అక్కడిక్కడే మరణించాడు. అతను బసినేపల్లిలో జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2గా విధులు నిర్వహిం చేవాడు. మంగళవారం రాత్రి బసినేపల్లిలో విధులు ముగించుకుని బైక్‌లో ఎన్ఎస్‌గేటుకు బయలుదేరాడు. నాగసముద్రం క్రాస్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోలీసులు ధర్మవరం ప్రభుత్వా స్పత్రికి తరలించారు. మురళీక్రిష్ణకు తల్లిదండ్రులు అంజినమ్మ, చలపతి, భార్య కవిత, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

## కాలువలోకి వ్యర్థాలు వేయకండి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**అనంతపురంరూరల్, ఏప్రిల్ 16:** మండలంలోని కక్కలపల్లి క్రాస్ హైవే కింద ఉన్న కాలువలోకి వ్యర్థాలు ఇతరాత్రవాటిని వేయరాదని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు పేర్కొన్నారు. ఆ మేరకు ప్రాజెక్టు డీజీఎం(టెక్నికల్) తరుణ్‌కుమార్ నోటీసులు ఇచ్చారు. ఈ కాలువలోని నీరు నిత్యం రోడ్డు పైకి వచ్చి.. నిల్వ ఉండటంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గత 30న ఈతిప్పలు ఎప్పటికీ తప్పేనో అన్న శీర్షిక ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించిన విషయం విదితమే. ఈక్రమంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు స్పందించారు. కిమ్స్ సవేరా ఆస్పత్రి నుంచి మురుగు కాలవలోకి వ్యర్థాలు ఇతరాత వాటిని వేస్తున్నట్లు ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా కాలువలోకి ఏ ఇతర వ్యర్థాలు వేయకుండా చూడాలని సూచించారు. ఆ మేరకు నోటీస్ కాపీలను జిల్లా ఉన్నతాధికారులకు పంపించారు. కాగా గతంలో హైవే కింది నుంచి కక్కలపల్లి రోడ్డుగా స్థానికంగా కాలువలోకి వెళ్లేవి. అయితే హైవే కింద నీరు వెళ్లకుండా కాలువను స్థానికంగా ఉన్న ఫంక్షన్ హాల్ యజమాని పూర్తి పూడ్చివేశారు. దీంతో నిత్యం ఈ సమస్య తలెత్తుతోంది. అయితే అధికారులు వీటిని పరిగణలోకి తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

## కూటమికి జేఏసీ సంపూర్ణ మద్దతు

**అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 16:** ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులకు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ చైతన్య జేఏసీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ సంఘం నాయకులు ప్రకటించారు. కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఆ నాయకులు రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లు మంగళవారం అనంతపురం టీడీపీ, బీజేపీ, జనసేన, కూటమి పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం అర్బన్ అసెంబ్లీ అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ యువనేత పరిటాల శ్రీరామ్ చేతుల మీదుగా విడివిడిగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దండు ఆనంద్‌కుమార్, బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డీకే రామలింగం, కులవృత్తుల చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కంసల నారాయణస్వామి, బీసీ నాయకులు మాడిశెట్టి శ్రీనివాస్, పవన్‌కుమార్, రామచంద్ర పాల్గొన్నారు.

## మద్యం బాటిళ్లు స్వాధీనం

**అనంతపురం క్రైం, ఏప్రిల్ 16** : నగరంలోని నీలిమా కూడలి వద్ద స్థానిక కళావతమ్మ కాలనీకి చెందిన ఓ వ్యక్తిని త్రీటౌన్ సీఐ ధరణి కిశోర్, ఎస్ఐ గోపాలుడు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో మద్యం దుకాణం నుంచి మూడు బాటిళ్లు కొనుగోలు చేసి 50 బాటిళ్లు అయ్యాక అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. మద్యం విక్రేతపై కేసు నమోదు చేశామన్నారు.

## పశుగ్రాసం దగ్ధం

**రాప్తాడు, ఏప్రిల్ 16:** మండలంలోని బొమ్మేపర్తి గ్రామంలో రైతు నరసింహులకు చెందిన పశుగ్రాసం మంగళవారం దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు పశుగ్రాసం సమీపంలో నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి పశుగ్రాసానికి వ్యాపించాయి. నాలుగు ట్రాక్టర్ల వేరుశనగ, మూడు ట్రాక్టర్ల జొన్నసొప్ప, నాలుగు ట్రాక్టర్ల వరిగడ్డి కాలిపోయింది. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. దాదాపు రూ. 2 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

## ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

**అనంతపురం క్రైం, ఏప్రిల్ 16:** జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డీపీఓలోని తన చాంబర్‌లో జిల్లాకు కేటాయించిన బీఎస్ఎఫ్ అధికారులతో మంగళవారం ఎస్పీ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్ లక్ష్మీనారాయణరెడ్డి (ఏఆర్) పాల్గొన్నారు.

## వైసీపీ అభ్యర్థులను ఎన్నికల్లో బహిష్కరించాలి

**అనంతపురం సెంట్రల్** : దళిత, గిరిజనులపై దాడులు, దౌర్జన్యాలు చేసిన వైసీపీ అభ్యర్థులను ఎన్నికల్లో బహిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి ప్రకటనలో సూచించారు. తూర్పు గోదావరి జిల్లాలో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును పదవి నుంచి తొలగించాలని, ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తిని ఎన్నికల నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

## రైతు సమస్యలపై నాయకులు దృష్టి సారించాలి

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 16:** ఎన్నికల్లో పోటీ చేసే ప్రధాన పార్టీల నాయకులు రైతుల సమస్యపై దృష్టి సారించాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఇండియా కూటమి అనంతపురం ఎమ్మెల్యే అభ్యర్థి జాఫర్‌తో కలిసి ఆయన స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాల యంలో మాట్లాడారు. ప్రస్తుతం రైతుల గురించి ఆలోచించే నాయకుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులను ఆదుకోకుంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఎండిపోతున్న పంటలను రక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపునకు సహకారం అందించాలన్నారు. జాఫర్ మాట్లాడుతూ.. బీజేపీకి జగన్ పూర్తిగా సరెండర్ అయిపోయారని విమర్శించారు. బీజేపీ రాష్ట్రానికి ఏమి మేలు చేసిందని మద్దతు తెలుపుతున్నారో ఆ పార్టీకి మద్దతు తెలిపే పార్టీల నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వాసు, సీపీఐ నాయకులు నారాయణస్వామి, శ్రీరాములు పాల్గొన్నారు.

## ఓట్ల కోసం కులాల మధ్య ప్రకాశ్ రెడ్డి చిచ్చు

**ధర్మవరంరూరల్, ఏప్రిల్ 16:** కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయం చేసి లబ్ధిపొందడమే రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి నైజమని, నియోజకవర్గ వ్యాప్తంగా అబద్ధాలతో కులాల చిచ్చురేపి అధికారంలోకి వచ్చాడని స్థానిక సర్పంచ్ భర్త అంకే రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ తలమాసి పాపన్న విమర్శించారు. కనగానపల్లిలోని పరిటాల భవన్‌లో టీడీపీ నాయకులతో కలిసి వారు మాట్లాడారు. వైసీపీ విధానాలు నచ్చక కనగానపల్లిలో పెద్దఎత్తున వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరుతున్నారన్నారు. దీన్ని జీర్ణించుకోలేక స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరిన వారిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. వైసీపీలో బీసీ, ఎస్సీలకు అన్యాయం జరుగుతోందని, బీసీలు పదవుల్లో ఉన్నా పెత్తనం మాత్రం ఎమ్మెల్యే అనుచరులదే అని అన్నారు. రాప్తాడు నియోజకవర్గం అభివృద్ధి పరిటాల కుటుంబం వల్లే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పూజారి నాగభూషణం, గగ్గల్ల పోతలయ్య, దాసరి నాగేష్, పసల వెంకటేష్, అంకే చంద్ర, సురేష్, రామచంద్ర, ఆర్ఎంపీ పోతలయ్య, బీరన్న, తలమాసి రాజేంద్ర, రాజప్ప, పెద్దన్న, శీన, సాకే నాగేష్, బోనాసి ఓబుళపతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు అంకే రామకృష్ణ

## జీతాలందని వర్సిటీ ఉద్యోగులు

**అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 16**: రెండు నెలలుగా జీతాలు అందక జేఎన్‌టీయూ, ఎస్కేయూ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీసీ నుంచి స్వీపర్ వరకు ఇదే పరిస్థితి. జగన్ పాలనలో జీతాలు, డీఏలు తదితర వాటి పెంపును పూర్తిగా మరిచిపోయి... నెలకు జీతాలిస్తే చాలు దేవుడా.. అనే పరిస్థితికి ఉద్యోగులు చేరుకున్నారు. అంతవరకు పండగలు లేవు... జీతాలు పడినప్పుడే ఆ ఉద్యోగులకు పండుగ. ఈ ఐదేళ్లలో కనీసం మూడు మాసాలు కూడా సకాలంలో జీతాలు తీసుకున్న దాఖలాలు లేవని వారు వాపోతున్నారు. ఇంటి అద్దె, రుణ కంతులు, పాలు, కరెంటు ఇలా అన్ని బిల్లులు పెండింగ్ పెట్టాల్సిన దుస్థితి నెలకొందని మండిపడుతున్నారు. జీతాల్లేక ఉగాది, రంజాన్ పండుగలను నామ మాత్రం నిర్వహించుకున్నామన్నారు. రెగ్యులర్, కాంటాక్ట్, మినిమం, టైమ్‌స్కేల్, ఔట్‌సోర్సింగ్ ఇలా వందలాదిమంది ఉద్యోగులు జేఎన్‌టీయూ, ఎస్కేయూలో పనిచేస్తున్నారు. వీరితోపాటు అనేకమంది ఉద్యోగ విరమణ చేశారు. తమ జీవిత చరిత్రలో జీతాలివ్వలేని ఇలాంటి ప్రభుత్వాన్ని మొదటిసారి చూస్తున్నామని వారు వాపోతున్నారు. జగన్ పుణ్యమా అని జీతాలు, పెన్షన్‌లు రాకపోవడంతో బీపీ, షుగర్ తదితర మందులూ కొనులేకపోతున్నామని మండిపడుతున్నారు. ప్రభుత్వం వద్ద ఉంచుకున్న పొదుపు సొమ్ము చెల్లించాలని దరఖాస్తు చేసుకున్నా పట్టించుకునే వారే కరువయ్యారని వాపోతున్నాయి. అప్పులుచేసి కుటుంబాలను నెట్టుకురావాల్సిన దుస్థితి నెలకొందన్నారు. నెల ఆలస్యమైతే అప్పులిచ్చిన వారు వడ్డీలు కట్టమని నిలదీస్తున్నారని, తమ జీతాలు సకాలంలో చెల్లిస్తే అప్పుల పాలు కావాల్సిన పరిస్థితి ఉండేది కాదని వాపోతున్నాయి.

## గ్రామాల్లో పోలీసుల కవాతు

**శింగనమల ఏప్రిల్ 16**: ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని శింగనమల మండలంలో పోలీసులు కావాతు నిర్వహించారు. మంగళవారం సీఐ శ్రీధర్,ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శింగనమల, సీ.బండమీదపల్లి, నాగులగుడ్డం ఇరువెందల, కల్లుమడి గ్రామాల్లో కేంద్ర బలగాతో కవాతు నిర్వహించారు.

**రాప్తాడు** : రానున్న ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని రాప్తాడు సీఐ మునిస్వామి తెలిపారు.మంగళవారం రాప్తాడు, ప్రసన్నాయపల్లి గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీరామనవమికి ముస్తాబైన ఆలయాలు

**అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 16** : శ్రీరామనవమిని పురస్కరించుకుని జిల్లాలోని రామమందిరాలన్నీ ముస్తాబ య్యాయి. బుధవారం భక్తజనకోటితో ఆ ఆలయాలు కిటకిటలాడ నున్నాయి. వేడుకల నేపథ్యంలో ఇప్పటికే రామాలయాలన్నీ విద్యుద్దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా అందంగా తీర్చిదిద్దారు. భక్తుల రద్దీని దృష్టిలో బారికేడ్లను సైతం ఏర్పాటు చేశారు.

**నగరంలో వేడుకలు** : మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో బుధవా రం నుంచి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఆరంభమ వనున్నాయి. ఇక ఆజాద్‌నగర్‌లోని దత్తమందిరం, విద్యుత్‌నగర్ కాలనీలోని పంచముఖాంజనేయస్వామి దేవాలయం, లక్ష్మీనగర్ రామాలయం, శ్రీనివాసనగర్ రామాంజనేయ ఆలయం, వేణుగోపాల్ నగర్ సద్గు రు సాయినాథ మందిరం, విద్యారణ్యనగర్ రామాలయం, మారుతీ నగర్ రామాలయం, పాతూరు రామస్వామి గుడి, రెవెన్యూకాలనీ రామాలయం, అంబేద్కర్ నగర్ రామాలయం, బుడ్డప్పనగర్ రామాలయం, పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం, సోమనాథనగర్‌లోని రామాలయాలతోపాటు అన్ని ప్రాంతాల్లోని రామాలయాల్లో ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాకార్యక్రమాలు, కల్యాణోత్సవాలు, ఉట్లమాను పరుషలు నిర్వహించనున్నారు.

**అఖండ రామనామ సంకీర్తన** : శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో 24 గంటల అఖండ రామనామ సంకీర్తనను మంగళవారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో సీతారాముల చిత్రపటానికి పూజాదులు నిర్వహించి, అఖండ రామనామ సంకీర్తనకు శ్రీకారం చుట్టారు. భక్తులు రామనామాన్ని పఠిస్తూ భక్తి తన్మయత్వం పొందారు. కార్యక్ర మంలో అఖండ రామనామ సంకీర్తన బృందం నిర్వాహకుడు బూశెట్టి రమణమూర్తి, పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, గర్జాల నాగరాజు, చల్లా కృష్ణ రంగయ్య, స్వర్ణలత, సాయినాథగుప్త, ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ వ్యవస్థాపకురాలు దేవరకొండ కౌసల్య పాల్గొన్నారు.


అలంకరణలో పాతూరు రామస్వామి ఆలయం


పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అఖండ రామనామ సంకీర్తనలో భక్తులు

## పంచాయతీ గోడలకు తొలగని వైసీపీ రంగులు


పంచాయతీ కార్యాలయంలో తొలగించని వైసీపీ రంగులు, ఫ్లెక్సీ

**నార్పల, ఏప్రిల్ 16:** నార్పల పంచాయతీ కార్యాలయం గోడలకు వైసీపీ రంగులు వేశారు. కోడ్ అమల్లోకి వచ్చినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. ఆ కార్యాలయంలో సీఎం జగన్ ఫ్లెక్సీని ఉంచారు. అదే కార్యాలయంలో సర్పంచు సుప్రియ, ఎంపీడీఓ రాముడు ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాల్సిన ఎంపీడీఓ రాముడు ఇతర అధికారులు పంచాయతీ కార్యాలయం గోడలకు వైకాపా రంగులున్నా.. వాటిని తొలగించకుండానే అదే గదిలో గ్రామ సభ నిర్వహించారు. కోడ్ అమల్లోకి వచ్చి నెల రోజులు అవుతున్నా... వైసీపీ రంగులను అధికారులు తొలగించకుండా అధికారులు ఇంకా నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారు.

## నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

**అనంతపురంరూరల్, ఏప్రిల్ 16**: మండలంలోని శిల్పారామంలో శ్రీరామనవమి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఓ క్రిష్ణప్రసాద్ తెలిపారు. సాయంత్రం శ్రీ గురుకృప సంగీత నిత్య కళానికేతన్ నృత్య గురువు డా. పట్నం శివప్రసాద్ శిష్య బృందం కూచిపూడి, భరత నాట్య నృత్య ప్రదర్శనలుంటాయన్నారు.

## 21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

**గార్లదిన్నె, ఏప్రిల్ 16:** ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 21న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి 305 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆ విద్యార్థులకు ఈనెల 21న ఆదివారం ఉదయం 10 నుంచి 12 వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

## శ్రీరామనవమి ఉత్సవాలకు విరాళం

**గార్లదిన్నె, ఏప్రిల్ 16** : మండలంలోని మర్తాడు గ్రామంలో బుధవారం నిర్వహించనున్న శ్రీరామ నవమి ఉత్సవాలకు శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి రూ. 10వేలు విరాళం అందచేశారు. ఆ నగదును మంగళవారం మర్తాడులో స్థానిక టీడీపీ నాయకుల ద్వారా గ్రామస్థులకు అందచేశారు.

## తాగునీటి సమస్య రాకుండా చూడండి

**రాప్తాడు, ఏప్రిల్ 16:** వేసవిలో ప్రజలకు తాగునీటి కష్టాలు రాకుండా చూడాలని ఎంపీడీఓ గీతావాణి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ మోటార్లు రిపేర్లు వచ్చినా... పైపులైన్లు పగిలినా వెంటనే సరి చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జయలక్ష్మి, జడ్పీటీసీ హేమావతి, వైస్ ఎంపీపీలు రామాంజినేయులు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## లాడ్జిల్లో అక్రమాలకు తావియ్యకండి

**అనంతపురం క్రైం, ఏప్రిల్ 16:** లాడ్జిల్లో అక్రమాలకు తావిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అనంతపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన వన్‌టౌన్ సీఐ రెడ్డప్పతో కలిసి నగరంలోని పలు లాడ్జిలను తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ... లాడ్జిల్లో రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. అనుమానాస్పదుల వ్యక్తులు లాడ్జిల్లో బసచేసిన సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

## విరిగిపోయే స్థితిలో విద్యుత్ స్తంభం

**అనంతపురంరూరల్, ఏప్రిల్ 16**: మండలంలోని ఆలమూరు రోడ్డు ఎస్ఎల్ఎన్ డిగ్రీ వెనుకవైపు 11 కేవీ విద్యుత్ స్థంభం విరిగిపోయే స్థితిలో ఉంది. విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి ఏళ్లుగడుస్తుండటంతో స్తంభం పూర్తిగా దెబ్బతింది. స్తంభానికి ఉన్న సిమెంటు మొత్తం పోయి ఇనుప కండీలు కనిపిస్తున్నాయి. ఆ స్తంభం ఒకవైపుకు వాలింది. ఓ మోస్తారు గాలులు వీచాయంటే స్తంభం విరిగే పరిస్థితి ఉంది. చుట్టుపక్కల కళాశాలలు ఉండటంతో ఆయా కళాశాల విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

## మైనార్టీల ద్రోహి జగన్‌కు బుద్ధిచెప్పాలి

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జయరాం



మైనార్టీ నాయకులతో మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం

**గుంతకల్లు, ఏప్రిల్ 16:** మైనార్టీలకు ద్రోహం చేసిన జగన్‌కు ముస్లింలు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ముస్లిం మైనార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ తాను మైనార్టీల పక్షపాతినని చెప్పిన జగన్ మాటలు నమ్మి వైసీపీకి ఓటేసిన వారికి తీరని ద్రోహం జరిగిందన్నారు. టీడీపీ హయాంలో ముస్లింలకు కల్పించిన సంక్షేమ కార్యక్రమాలను రద్దుచేయడం, కొన్నింటిని నీరుగార్చారన్నారు. ముస్లింలను నిండా ముంచిందికాక, టీడీపీ ఎన్డీయేలో చేరిందని, ముస్లింలకు నష్టం కలుగుతుందంటూ మొసలి కన్నీరు కారుస్తున్నాడన్నారు. ఈ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి ముస్లింలు పెద్ద ఎత్తున సదస్సును నిర్వహించి వాస్తవాలను బహిర్గతం చేద్దామని పిలుపునిచ్చారు. గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, అంజి, కోడి సీనా, రమేశ్, మైనార్టీ నాయకులు గుజరీ మహమ్మద్ ఖాజా, అన్వర్ బాషా, ఫ్రూట్ మస్తాన్, ఆటో ఖాజా, రంజాన్ పాల్గొన్నారు.

**నెట్టికంటికి పట్టువస్త్రాల సమర్పణ:** రానున్న ఎన్నికల్లో టీడీపీ అన్ని చోట్లా ఘనవిజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి పదవినెక్కాలని కోరుకుంటూ గుమ్మనూరు జయరాం కసాపురం దేవస్థానంలో పూజలు చేశారు. మంగళవారం మధ్యాహ్నం దేవస్థానానికి వెళ్లిన జయరాంకు ఆలయ అర్చకులు స్వామివారి సన్నిధిలో పూజలు చేయించారు. ఈ సందర్భంగా జయరాం స్వామికి పట్టు వస్త్రాన్ని సమర్పించారు.

### టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి



తురకపల్లిలో ప్రచారం చేస్తున్న గుమ్మనూరు సోదరులు

**గుత్తిరూరల్:** టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని గుంతకల్లు ఎమ్మెల్యే అభ్యర్థి జయరాం సోదరుడు నారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని తురకపల్లిలో ఆయన ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒకరు సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలుపించాలన్నారు. మండల కన్వీనర్ బర్దివలి, సర్పంచు భరత్, చిన్నరెడ్డి యాదవ్, మాజీ సర్పంచు నరసింహులు, కరిడికొండ సూరి, కిట్టు, రవితేజ, ఎంకే చౌదరి, ప్రతాప్, గోవిందు, రంగారెడ్డి యాదవ్, నాగేశ్వరావు, సుధాకర, నాగరాజు పాల్గొన్నారు.

## కూటమిదే విజయం



రాకెట్లలో ప్రచారం చేస్తున్న విజయ్ సింహా

**ఉరవకొండ, ఏప్రిల్ 16:** సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలో రావడం ఖాయమని టీడీపీ యువనేత విక్రమ సింహా అన్నారు. మండలంలోని లత్తవరం, లత్తవరం తండాలో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి పయ్యావుల కేశవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. టీడీపీ నాయకులు మదమంచి శ్రీనివాసులు, మాజీ సర్పంచు గోవిందు, ఓబన్న, మోహన్, బళ్లారి మల్లి, రాకెట్ల నాయకులు సిసింద్రి, నెట్టెం రాము, కొండారెడ్డి పాల్గొన్నారు. అలాగే వజ్రకరూరు మండలం కడమలకుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ నూతేటి వెంకటేష్, నాగేంద్ర, ఎర్రిస్వామి, ఈశ్వర్, సర్పంచ్ సుధీర్ పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే అభివృద్ధి

**యాడికి, ఏప్రిల్ 16:** చంద్రబాబుతోనే అభివృద్ధి పనులు సాకారం అవుతాయని టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు అన్నారు. యాడికిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి తరపున మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య పాల్గొన్నారు.

**పెద్దవడుగూరు:** మండలంలోని చిన్నవడుగూరు గ్రామంలో మంగళవారం టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, దివాకర్‌రెడ్డి, దస్తగిరి, లక్ష్మినారాయణ, హరికృష్ణరావు పాల్గొన్నారు.

**బొమ్మనహాళ్:** చంద్రబాబు అధికార పగ్గాలు చేపడితే అన్ని రంగాల వారికి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, వాణిజగన్నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బొల్లనగుడ్డం, కళ్లహోళ గ్రామాలలో ప్రచారం చేశారు. ముల్లంగి నారాయణస్వామి, యర్రగుంట్ల వెంకటేశులు, అప్పారావు, మహేంద్ర, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

**డీ.హీరేహాళ్:** గ్రామాలలో ప్రజల్లో వస్తున్న ఆదరణ చూస్తుంటే రాబోవు రోజులలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని మల్లికేతి గ్రామంలో ప్రచారం చేశారు. అనుబంధకమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరిహారం అందించాలి

**కూడేరు, ఏప్రిల్ 16:** మండలం జల్లిపల్లి గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సజీవ దహనమైన విద్యార్థి కుటుబానికి ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కుటుంబ పోషణకు నడుపుకుంటున్న హోటల్లో గ్యాస్ లీకై పెద్ద ఎత్తున మంటలు చెలరేగి ప్రమాదం జరిగిందన్నారు. విద్యార్థి ప్రత్యూష మృతి చెందడం బాధాకరమని, గాయపడ్డ మహిళకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆయనతోపాటు మండల కార్యదర్శి వెంకటేష్, కారీం, మల్లికార్జున, వీరప్ప ఉన్నారు.

## ఖాజీ పదవి నుంచి యూసఫ్‌వలీని తొలగించాలి

**బొమ్మనహాళ్, ఏప్రిల్ 16:** మండలంలోని కళ్లహోళ గ్రామంలో ఉన్న యూసఫ్‌వలీని ఖాజీగా నియమించడంపై ముస్లింలు బొమ్మనహాళ్ రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. యూసఫ్‌వలిని ఖాజీగా నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు ఇవ్వడంపై మైనార్టీల సంఘం మండిపడింది. అతనికి ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని తరతరాలుగా ఉంటున్న కుటుంబాలకే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేసి రెవెన్యూ అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంపై తహసీల్దార్ చాంబర్‌లో ఖాళీ కుర్చీ ముందు వినతిపత్రం పెట్టారు. కో ఆప్షన్ మెంబర్ మాబూసాబ్, మాజీ కో ఆప్షన్ మెంబర్ సర్మాస్‌వలి, మైనార్టీ సంఘం నాయకులు షఫీ, ఖాజీ మహ్మద్, రఫీ, సైపుల్లా, బాబాఫక్రుద్దీన్, సులేమాన్, ఖాజావలి పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీ కుర్చీ ముందు వినతిపత్రం ఉంచిన మైనార్టీలు



బంజారా దుస్తులతో చేతిలో కత్తిపట్టి ప్రజలకు చూపుతున్న అమిలినేని



బంజారాల ఆత్మీయ సమావేశానికి హాజరైన అశేష ప్రజానీకం

# ప్రతి రైతుకు సాగునీరిచ్చి ఆదుకుంటాం

● కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

**కళ్యాణదుర్గం, ఏప్రిల్ 16:** నియోజకవర్గంలో వ్యవసాయంపై ఆధారపడ్డ రైతులు చాలా మంది వున్నారని, ప్రతి చెరువుకు సాగునీరిచ్చి రైతును ఆదుకుంటామని కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అభయమిచ్చారు. మంగళవారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద బంజారాలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అలాగే శ్రీనివాస కళ్యాణమండపంలో ఉప్పర సోదరులతో కూడా సమావేశాన్ని నిర్వహించారు. అమిలినేనికి బంజారాల సంప్రదాయ దుస్తులతో నృత్యం చేస్తూ గజమాల, తలపాగా పెట్టి ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక 26 పథకాలను రద్దు చేసి ఎస్సీ, ఎస్టీల పొట్ట కొట్టారని మండిపడ్డారు. ప్రజలను ఇబ్బంది పెట్టడమే జగన్ నైజమని ధ్వజమెత్తారు. ఉద్యోగ, ఉపాధి కల్పించకపోవడంతోనే వలసలు ఎక్కువై పోతున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే బీటీపీ కాలువ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మే 13న ప్రతి ఒక్కరు ఓటు వేసి టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అదేవిధంగా ఉప్పరకులస్తుల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేస్తానన్నారు. మనమందరం ఐక్యతగా వుంటూ విజయానికి అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. బంజారా రాష్ట్ర అధ్యక్షుడు కేశవనాయక్, విజయవాడ బహుజన పార్టీ అధ్యక్షుడు గురునాథమ్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కొండారెడ్డి, నరహరి ప్రసాద్, సోమ్లానాయక్, ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడు నాగముని, ఉప్పర సంఘం మాజీ డైరెక్టర్ శ్రీకాంత్, మాజీ సర్పంచ్ శివకుమార్, మహిళలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# అశ్మిత్ రెడ్డి విస్తృత ప్రచారం

**తాడిపత్రిటౌన్, ఏప్రిల్16:** పట్టణంలోని జయనగర్‌కాలనీ, బిందెల కాలనీ, పీర్లచావిడితోపాటు మండలంలోని గన్నెవారిపల్లి కాలనీలో మంగళవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కదిరి శ్రీకాంత్ రెడ్డి, నరసింహాచారి, చింబిలి ప్రసాద్‌నాయుడు, పవన్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, విజ్జి, బీజేపీ నాయకులు గంగాధర్, రాంబాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

**పెద్దవడుగూరు:** మండలంలోని వెంకటాంపల్లి, ఆవులాంపల్లి, విరుపాపురం గ్రామాల్లో మంగళవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, వీఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి, రమేష్‌యాదవ్, దివాకర్‌రెడ్డి, నాగరాజు, చిరంజీవి పాల్గొన్నారు.

**40కుటుంబాలు చేరిక:** మండలంలోని జీ. వెంకటాంపల్లి గ్రామానికి చెందిన 30కుటుంబాలు, బందార్లపల్లి గ్రామానికి చెందిన 10కుటుంబాలు జేసీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో మంగళవారం వైసీపీని వీడి టీడీపీలో చేరాయి.



వెంకటాంపల్లి గ్రామస్థులతో జేసీ ప్రభాకర్‌రెడ్డి



వృద్ధురాలిని పలకరిస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

**టీడీపీ విజయానికి కృషి: జేసీ పవన్‌రెడ్డి**

వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి అందరం కృషిచేద్దామని టీడీపీ నాయకుడు జేసీ పవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని టైలర్స్‌కాలనీలో ఉన్న టీడీపీ సీనియర్ నాయకులు కాకర్ల రంగనాథను మంగళవారం జేసీ పవన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ పవన్‌రెడ్డి కాకర్ల బ్రదర్స్ రంగనాథ, జయుడు, రంగనాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రెట్టించిన ఉత్సాహంతో నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొనాలన్నారు.

**ఓటు వేసేముందు ఆలోచించండి: జేసీ దివాకర్‌రెడ్డి**

యాడికి: ఎన్నికల్లో ఓటువేసే ముందు ఒక్కసారి రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి, ప్రజా సంక్షేమం గురించి ఆలోచించాలని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చింతలాయపల్లి, కుందనకోట, గుడిపాడు గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామస్తులను కలిసి సమస్యలపై ఆరాతీశారు.

## టీడీపీలో 15 కుటుంబాల చేరిక

**రాయదుర్గం, ఏప్రిల్ 16:** గుమ్మఘట్ట మండలంలోని జె.వెంకటంపల్లి గ్రామానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న ఆధ్వర్యంలో పార్టీలో చేరిన తిమ్మరెడ్డి, శంకర్‌రెడ్డి, రాము, తిప్పారెడ్డి, వడ్డే శీనతో పాటు మరో 10 కుటుంబాలకు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

**గుత్తి:** గుత్తిఆర్ఎస్‌లోని 6వ వార్డులో టీడీపీ నాయకులు రామరాజు, చంద్ర ఆధ్వర్యంలో మంగళవారం నాయీబ్రహ్మణ కులానికి చెందిన 30 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీతోనే సమాజిక న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాది సోమశేఖర్, నాయకులు కేశవనాయుడు, రాము, ప్రసాద్, శ్రీనివాసులు, ఎంకే చౌదరి, యంగన్నపల్లి సర్పంచు భరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థులకు ఎమ్మార్పీఎస్ మద్దతు

**గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 16:** కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ గెలుపునకు ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. కసాపురం రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం గుమ్మనూరు జయరాంతో ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశం అయ్యారు. నియోజకవర్గంలో ప్రచార కార్యక్రమాల రూట్ మ్యాప్‌పై వారు జయరాంతో చర్చించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్, నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్ మాదిగ, సీనియర్ నాయకులు బీసీఆర్ దాసు, హరిగోపాల్, లక్ష్మీనారాయణ, హరిచంద్ర, లాల్‌స్వామి, రామాంజనేయులు, సునీతమ్మ పాల్గొన్నారు.

## పోలీసుల కవాతు

**తాడిపత్రిటౌన్, ఏప్రిల్16:** తాడిపత్రి పరిధిలోని అత్యంత సమస్యాత్మక గ్రామాలైన సజ్జలదిన్నె, ఊరుచింతల, తలారిచెరువు గ్రామాల్లో మంగళవారం డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో రూరల్ సీఐ లక్ష్మికాంత్‌రెడ్డి, ఎస్ఐ సాగర్ కేంద్రబలగాలతో కవాతు నిర్వహించారు. ప్రశాంతవాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏఎస్ఐ కాటమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

**కణేకల్లు, ఏప్రిల్ 16:** ఇంటర్‌మీడియేట్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఆయేషా అనే విద్యార్థినికి లయన్స్‌క్లబ్ నిర్వాహకులు ప్రోత్సాహక నగదును అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు వేలూరు మరియప్ప ఆధ్వర్యంలో సభ్యులు రూ.10 వేలు నగదు అందజేశారు. మాబుసాబ్, బీటీ రమేష్, జయరాంచౌదరి, చంద్రశేఖర్‌గుప్తా, చాంద్‌బాషా, శరభనగౌడ్, అశోక్ పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొన్న కారు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

**తాడిపత్రిటౌన్, ఏప్రిల్16:** పట్టణంలోని పొలిమేర పెద్దమ్మతల్లి ఆలయ సమీపంలో మంగళవారం డివైడర్‌ను కారు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన మేరకు పులివెందులకు చెందిన భాస్కర్‌రెడ్డి కారులో అనంతపురం నుంచి పులివెందులకు వెళుతుండగా పట్టణంలోకి రాగానే ప్రధాన రహదారిలో ఉన్న డివైడర్‌ను వేగంగా ఢీకొనడంతో కారు ముందుభాగం దెబ్బతినింది. సమయానికి కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో భాస్కర్‌రెడ్డి బయటపడ్డాడు.

## గుత్తి ఆర్ఎస్‌లో చోరీ

**గుత్తి, ఏప్రిల్ 16:** గుత్తి ఆర్ఎస్‌లోని అయ్యప్ప కాలనీలో నివాసముంటున్న కొలమి బాషా ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. కొలమిబాషా కుటుంబ సభ్యులతో కలసి బంధువులు ఇంటికి వెళ్లాడు. దుండగులు ఇంటి తాళాలను పగలగొట్టి ఇంట్లో ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.38 వేలు, జత కమ్మలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## దాడి కేసులో ఒకరి అరెస్ట్

**తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 16:** మండలంలోని గన్నెవారిపల్లికాలనీకి చెందిన అల్లీపీరాను దాడికేసులో మంగళవారం అరెస్టుచేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మార్చి17న గన్నెవారిపల్లికాలనీలోని చికెన్‌సెంటర్ వద్ద ఉన్న ఖాదర్‌బాషాపై మద్యంమత్తులో అల్లీపీరా కత్తితో దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేశామన్నారు. నిందితున్ని మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు పంపామని పోలీసులు తెలిపారు.

## 25మంది బైండోవర్

**యల్లనూరు, ఏప్రిల్ 16:** సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలో 25 మందిని బైండోవర్ కేసులు నమోదుచేసినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు. మేడికుర్తి గ్రామంలో రెండువర్గాలకు చెందిన వారి ని స్టేషన్‌కు పిలిపించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినట్లు ఆయన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.

**పుట్లూరు:** మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామానికి చెందిన ఇరువర్గాలను బైండోవర్ చేసినట్లు మంగళవారం ఎస్ఐ హేమాద్రి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో శాంతి వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ముందస్తుగా బైండోవర్ చేశామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఎదుట వారిని హాజరుపరిచామని ఆయన తెలిపారు.

## జూదరుల అరెస్ట్

**రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 16:** మండలంలోని కొండాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. కొండాపురం గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారాన్ని సేకరించి స్థావరంపై దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.12,200 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలిస్తునట్లు సీఐ తెలినారు.

## నాటుసారా ఊట ధ్వంసం

**బెళుగుప్ప, ఏప్రిల్ 16:** మండల కేంద్రానికి శివారులో మంగళవారం తమ సిబ్బందితో కలసి నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి 300 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసి ఊటను ధ్వంసం చేయడంతో పాటు ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు.

**కర్ణాటక మద్యం స్వాధీనం:** మండలంలోని జీడిపల్లి క్రాస్ వద్ద మంగళవారం ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్ డిప్యూటీ తహసీల్దారు హుస్సేన్ పీరా ఆధ్వర్యంలో కర్ణాటక మద్యం పట్టుకున్నారు. అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా హనిమిరెడ్డిపల్లికి చెందిన వ్యక్తి జీడిపల్లి మీదుగా బైకులో 88 టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా బైకుతో పాటు వ్యక్తికి అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

# నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి: ఆర్వో

**ఉరవకొండ, ఏప్రిల్ 16:** సార్వత్రిక ఎన్నికల నామినేషన్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్వో, జేసీ కేతన్ గార్గ్ తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 18వ తేదీన ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుందని తెలిపారు. 18 నుంచి 25 తేదీ వరకూ నామినేషన్ల స్వీకరిస్తామన్నారు. 26న నామినేషన పరిశీలన, 29న ఉపసంహరణ, అదే రోజు అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామన్నారు. ప్రతిరోజు ఉదయం 11 నుంచి 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి రూ.11,50,249 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. 287మందిని బైండోవర్ చేశామన్నారు. ఈఆర్వో శిరీష, తహసీల్దారు శ్రీనివాసులు, పాల్గొన్నారు.

**తాడిపత్రిటౌన్:** తాడిపత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి సంబంధించి 18వ తేదీ నుంచి నామినేషన్లను స్వీకరించనున్నట్లు రిటర్నింగ్ అధికారి రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు అభ్యర్థులు తమ నామినేషన్లను వేయాల్సి ఉంటుందన్నారు. డీఎస్పీ గంగయ్య, తహసీల్దార్ ఆంజనేయులు, ఎన్నికల డీటీ ప్రసాద్, మున్సిపల్ టీపీఓ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్వో, జేసీ కేతన్‌గార్గ్

## జగన్ పాలనలో రాష్ట్రం 25 ఏళ్లు వెనక్కు

● మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు



ప్రజలను ఓటు అభ్యర్థిస్తున్న కాలవ శ్రీనివాసులు

**రాయదుర్గం, ఏప్రిల్ 16:** ఐదు సంవత్సరాల జగన్ పరిపాలనలో రాష్ట్ర భవిష్యత్తు 25 ఏళ్ల వెనక్కు వెళ్లిందని టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. మంగళవారం పట్టణంలోని 18వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను అందించి అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ టీడీపీ దిన దిన ప్రవర్ధమానమవుతూ బలాన్ని పుంజుకుంటుందన్నారు. వైసీపీ పరిస్థితి రోజు రోజుకు తీసికట్టుగా మారిందన్నారు. ప్రజలందరూ స్వేచ్ఛగా బయటకు వచ్చి వారి అభిప్రాయాలు స్పష్టంగా వ్యక్తం చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆశలపై నీళ్లు చల్లి స్వార్థమే పరమార్థంగా అసమర్థ అరాచక పరిపాలన జగన్‌రెడ్డి సాగించాడని మండిపడ్డారు. గాడితప్పిన పరిపాలనను గాడిలో పెట్టాలన్నా, ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న రాష్ట్రానికి దిశదశ కల్పించాలంటే చంద్రబాబు పాలన అనుభవం ముఖ్యమనే విషయం ప్రజలు గ్రహించారన్నారు. రాష్ట్ర బాగు, శాంతిభద్రతల బాగు కోసం, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే పరిశ్రమలు వచ్చి ఉద్యోగ ఉపాధి అవకాశాలు జరగాలంటే చంద్రబాబుతోనే సాధ్యమనే ఆలోచన, అభిప్రాయం అందరిలో కలుగుతోందన్నారు.

**దళితులను భూహక్కుదారులను చేస్తాం**

**కణేకల్లు:** టీడీపీ అధికారంలోకి వస్తే దళితులను భూహక్కుదారులుగా చేస్తామని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. సొల్లాపురం గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎస్సీకాలనీలోకి కాలవ వెళ్లగానే అక్కడి ప్రజలు తమకు భూములు లేవని భూములు కొనిచ్చి హక్కుదారులుగా చేయాలని కోరారు. దీనికి ఆయన స్పందించి భూములను ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, బీటీ రమేష్, ఆది, వన్నారెడ్డి, షేక్‌ముజ్జు, కోళకుర్తి సుదర్శన్, కురుబ నాగరాజు, మాబుసాబ్, చాంద్ బాషా, ఎంపీటీసీ నరేంద్ర పాల్గొన్నారు.

**ఊపందుకున్న ప్రచారం**



రాయదుర్గంలో ప్రచారం చేస్తున్న కాలవ శ్రీనివాసులు సతీమణి విజయలక్ష్మి

**రాయదుర్గంరూరల్:** పట్టణంలోని 17వ వార్డులో ఎన్నికల ప్రచారం ఊపందుకొంది. మంగళవారం సాయంత్రం ఇన్‌చార్జి కొలిమి కరెన్న ఆధ్వర్యంలో కాలవ శ్రీనివాసులు సతీమణి కాలవ విజయలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముదిగల్లు జ్యోతి, కౌన్సిలర్ ప్రశాంతి, మాజీ కౌన్సిలర్ బండి భారతి, గుర్రమ్మ పాల్గొన్నారు.

## దళితుల భూములకు పట్టాలు ఇప్పిస్తాం

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రావణిశ్రీ



ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న శ్రావణిశ్రీ

**పుట్లూరు, ఏప్రిల్ 16:** భూములను ఏళ్లతరబడి సాగు చేసుకుంటున్న దళితులకు పట్టాలు ఇప్పిస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ హామీ ఇచ్చారు. మండలంలోని మడుగుపల్లి, జంగంరెడ్డిపేట, ఎల్లుట్ల, ఓబులాపురం గ్రామాల్లో మంగళవారం ఆమె ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే గ్రామాల్లో కొండల కింద సాగు చేస్తున్న దళితుల భూములను పరిశీలించి పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించి న్యాయం చేస్తామన్నారు. ఎస్సీ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్‌గుర్తుకు ఓటువేసి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే దళితులకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

## వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

**గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 16:** పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. స్థానిక తిలక్‌నగర్‌లోని యూపీహెచ్‌సీలో మంగళవారం వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వడదెబ్బ తగలకుండా నీరు, పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. వైద్యులు కల్యాణ్‌చక్రవర్తి, అరుణ, హరిత, నవీన్, స్వాతి, హెల్త్ ఎడ్యుకేటర్ హరికుమార్ పాల్గొన్నారు.

## రేపటి నుంచి సుంకులమ్మదేవి రథోత్సవాలు

**విడపనకల్లు, ఏప్రిల్ 16:** మండల కేంద్రంలో వెలసిన సుంకులమ్మదేవి, దేవమ్మ దేవి నూతన రతోత్సవ వేడుకలు రేపటి నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ పెద్దలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అందించిన విరాళాలతో అమ్మవారికి నూతన రథాన్ని కర్ణాటకకు చెందిన వారితో తయారు చేయించారు. రథోత్సవ వేడుకలను 18వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రథోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## ఘనంగా మారెమ్మ జాతర



అలంకరణలో అమ్మవారు

**బొమ్మనహాళ్, ఏప్రిల్ 16:** మండలంలోని బండూరు గ్రామంలో వెలసిన మారెమ్మదేవి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువజామున గంగాజలం తెచ్చి అమ్మవారికి అభిషేకించి విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం అమ్మవారికి కుంభాభిషేకాలు జరిపించి దున్నపోతును బలి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

## భయ్యారెడ్డిస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

**యల్లనూరు, ఏప్రిల్ 16:** మండలంలోని కోడిమూర్తి గ్రామంలో భయ్యారెడ్డి స్వామి ఆరాధన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండురోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. అనంతరం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ

**తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 16:** పట్టణంలోని టీచర్స్‌కాలనీలో ఉన్న పెన్షనర్ల భవనంలో మంగళవారం దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి తెలిపారు. దాతలు రామచంద్రారెడ్డి, అంజనప్ప, అరవింద నారాయణరెడ్డి సహకారంతో సరుకులను అందించామన్నారు. నందవరం కేశవరెడ్డి, అశ్వర్థరెడ్డి, వెంకట్రామయ్య వీరారెడ్డి, హనుమంతరెడ్డి, పెద్దయ్య పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశానికి హాజరైన దళితులు, మహిళలు


ఆత్మీయ సమావేశానికి హాజరైన వాల్మీకులు, మహిళలు


శెట్టూరు రోడ్డుషోకు హాజరైన అశేష ప్రజానీకం

# నేనున్నానని..

- అభివృద్ధి చేసేందుకే 'దుర్గం' వచ్చా
- 114 చెరువులను నీటితో నింపుతా
- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తా
- యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తా
- ప్రచారంలో అమిలినేని హామీల వర్షం
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అజెండా
- అన్ని వర్గాలతో ఆత్మీయ సమావేశాలు
- సురేంద్రబాబుకు అడుగడుగున్నా అపూర్వ ఆదరణ
- కుటుంబ సభ్యుల ప్రచారానికి విశేష స్పందన
- టీడీపీ గెలుపు తథ్యమంటున్న కార్యకర్తలు

'అత్యంత వెనుకబడిన కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకే వచ్చా. ఇక్కడి ప్రజలు ఆకాంక్షలు నెరవేరుస్తా. ఎలాంటి సమస్య అయినా నా దగ్గరకు వస్తే పరిష్కారం చూపుతా' అని అమిలినేని సురేంద్రబాబు ప్రజలకు హామీ ఇస్తున్నారు. ఆయన ఉత్సాహం, సంకల్పం చూసిన ప్రజలు ఇకపై నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే ఆయన నియోజకవర్గంలోని అన్ని కులాల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి, ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని వారికి భరోసా కల్పిస్తున్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలను నేనున్నానని మనోధైర్యాన్ని కల్పిస్తున్నారు. బీటీపీ కాలువను పూర్తి చేసి నియోజకవర్గం లోని 114 చెరువులను నీటితో నింపడమే తన తొలి కర్తవ్యమని ఇదివరకే ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ఆడపిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇక్కడే ఒక నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద కురుబ, గొల్ల, వాల్మీకి, ఏకలవ్య, దళిత, నాయీ బ్రాహ్మణులు, బలిజ, వడ్డేర కులస్తులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి వారి అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఆయా కులస్తులకు కల్యాణ మండపాలు నిర్మిస్తామని హామీ ఇస్తున్నారు. దాంతో పాటు వైద్య చికిత్సలు అందించేందుకు కూడా ముందడుగు వేస్తున్నారు.

కళ్యాణదుర్గం


ప్రజావేదిక వద్ద నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి హాజరైన కురుబ కులస్తులు


వాల్మీకుల ఆత్మీయ సమావేశానికి హాజరైన కాలవ శ్రీనివాసులు, అంబికా లక్ష్మీనారాయణ, వాల్మీకులు

## దళితులతో సహపంక్తి భోజనాలు

కంబదూరులోని ఆర్డీటీ ఎస్సీ కాలనీలో అమిలినేని సురేంద్రబాబు దళితుల తో సహపంక్తి భోజనం చేశారు. వారితో మమేకమై ఇంటింటా తిరుగుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ తాను కూడా మీలో ఒకడినని వారితో కలిసిపోయారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తానని మాట ఇచ్చారు. అమిలినేని చొరవ, కలుపుగోలుతనం, సమస్యల పట్ల అవగాహన, పరిష్కారానికి కృషి గమనించిన ప్రజలు ఇలాంటి వ్యక్తి మనకు ఉండాలని బలంగా కోరుకుంటున్నారు. అదేవిధంగా అధికార వైసీపీ నుంచి వలసలు పెరిగాయి. ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా 1500 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. ఈక్రమంలోనే టీడీపీ తరపున పోటీ చేస్తున్న ఆయన గెలుపు ఖాయమని నియోజకవర్గంలోని గ్రామాల ప్రజలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.


కళ్యాణదుర్గంలో విజయం మనదేనంటూ విక్టరీ గుర్తు చూపుతున్న అమిలినేని సురేంద్రబాబు

## వలసలను నివారిస్తాం

నియోజకవర్గంలో నిరుద్యోగ యువత, ప్రజలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కూలీలు వలసలు వెళ్లకుండా శాశ్వత ఉపాధి అవకాశాలు ఇక్కడే లభ్యమయ్యే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇస్తున్నారు. కళ్యాణదుర్గం పట్టణాన్ని ఏవిధంగా అభివృద్ధి చేస్తామో ముందుగానే ఓ అజెండా రూపొందించా మని, దాని వివరిస్తే ప్రజల్లోకి వెళతామని పేర్కొంటున్నారు. అభివృద్ధి అంటే ఇలా ఉంటుందా అని ప్రజలు ఆశ్చర్యపోయేలా పనులు పూర్తి చేస్తామని హామీ ఇస్తున్నారు. అమిలినేని కుటుంబ సభ్యులు కూడా పట్టణం, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేస్తూ ఇంటింటికి తిరుగుతూ టీడీపీ గెలుపునకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. వీరి ప్రచారానికి కూడా విశేష స్పందన లభిస్తోంది.

## సమస్య ఏదైనా... చెప్పండి

నియోజకవర్గంలోకి అమిలినేని సురేంద్రబాబు అడుగు పెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఏ గ్రామానికి వెళ్లినా కార్యకర్తలకు ఒకటే అభయమిస్తున్నారు. ఏ సమస్య వచ్చినా నేరుగా తనకే తెలపాలని చెప్పారు. దీంతో కార్యకర్తలు సమస్యలు చెప్పుకోవడానికి ముందుకొస్తున్నారు. ఆయన సమస్యలను సావధానంగా వింటూ అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. దీంతో కార్యకర్తల మధ్య ఉన్న విభేదాలు సమసిపోతున్నాయి. అంతా ఏకతాటిపైకి వచ్చి టీడీపీ గెలుపునకు కృషి చేసేందుకు సిద్ధమవుతున్నారు.


ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమానికి అశేషంగా హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు


వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారితో అమిలినేని

## గ్రామాల్లో అపూర్వ ఆదరణ

ఎన్నికల ప్రచారంలో భాగంగా సురేంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతు న్నారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను అందరికీ అర్థమయ్యేలా వివరిస్తున్నారు. కుటుంబానికి ఆర్థిక భద్రత, యువతకు ఉపాధి, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుపడాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమని ప్రచారంలో వివరిస్తున్నారు. అందుకే టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో పొద్దు పోయే వరకు అమిలినేని సురేంద్రబాబు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాలకు వెళ్లిన సందర్భంలో గ్రామస్థులు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారు. హారతులు పట్టి పూల వర్షం కురిపిస్తూ, గజమాలలతో ఘనంగా స్వాగతిస్తున్నారు. గ్రామాల్లో అమిలినేనికి అపూర్వ ఆదరణ లభిస్తోందని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొంటున్నారు.


బెంగళూరు ఐటీ ఫోరం సభ్యులతో కలసి పట్టణంలో భారీ ఎత్తున ర్యాలీ చేపట్టిన అమిలినేని

## అభివృద్ధే ఉపాధి మంత్రం

నియోజకవర్గం అభివృద్ధి, యువతకు ఉపాధే తన లక్ష్యమని సురేంద్రబాబు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. గెలిచిన వెంటనే నియోజకవర్గంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆయన కార్యదీక్షను గమనించిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తండోపతండాలుగా తరలివస్తూ మద్దతు తెలుపుతున్నారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని, తాగునీరు సక్రమంగా అంది స్తామని, పట్టణాన్ని సుందరీకరిస్తామని, సీసీ రోడ్లు ఏర్పాట్లు చేస్తామని ఇలా హామీలు ఇస్తూ ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. మున్సిపాల్టీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లను మరమ్మతులు చేయించ డమే కాకుండా కొత్త రోడ్లు వేయించి ప్రయాణాన్ని సుఖప్రదం చేస్తామని చెబుతున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. మన నియోజకవర్గంలో లభించే ప్రకృతి వనరులనే ఆదాయ మార్గంగా మార్చుకుని ఆ ఆదాయంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు వేసుకుని శాయశక్తులా కృషి చేస్తానని చెబుతున్నారు.


కుందుర్పిలో జరిగిన రోడ్‌షోలో అమిలినేని సురేంద్రబాబును గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు, నాయకులు, కార్యకర్తలు


రంజాన్ వేడుకలను ముస్లింలతో జరుపుకుంటున్న అమిలినేని సురేంద్రబాబు


ఆత్మీయ సమావేశంలో అమిలినేని సురేంద్రబాబుకు గొర్రెపిల్ల, కంబళి బహూకరిస్తున్న కురుబ కులస్థులు


ప్రజావేదిక వద్ద నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి అశేషంగా హాజరైన ఏకలవ్య కులస్థులు, మహిళలు